క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన గ్రామస్తులు



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి పంచాయతీ పరిధి చింతలపేట్ గ్రామంలో మహిళా సమాఖ్య భవనం నిర్మించాలని గ్రామస్తులు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు వినతిపత్రం అందజేశారు. ఆదివారం ఉట్నూర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. చింతల్‌పేట్ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బొడ్డు నర్సయ్య, కొండ భూమశంకర్, ఎనగంటి హరిప్రసాద్, పిల్లి శివకృష్ణ, తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గం

ఖానాపూర్: ఖానాపూర్, కడెం, పెంబి మండలాల టెంట్‌హౌజ్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సమావేశంలో కమిటీ సమావేశం నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడిగా అయిందాల జనార్దన్, గౌరవ అధ్యక్షుడిగా సుతారి రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా పెందల నరేశ్, ఉపాధ్యక్షులుగా వెంకట రమణ, శ్రీధర్, కోశాధికారులుగా షాహిద్, జియా, కార్యదర్శిగా దాసరి లక్ష్మణ్, కార్యనిర్వాహక సభ్యుడిగా పంతుల నవీన్, సభ్యులుగా తదితరులు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని శాలువాతో సన్మానించారు.

ఆలయ వార్షికోత్సవం



పూజల్లో భక్తులు

ఖానాపూర్: పట్టణంలోని గాంధీనగర్ శివారులో నల్లపోచమ్మ ఆలయ నాలుగో వార్షి కోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. తిమ్మాపూర్ వీడీసీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు చేపట్టగా అర్చకులు ఈశ్వరాచారి ఆధ్వర్యంలో మహా గణపతి పూజ, పుణ్యాహవచనం, రుద్ర హోమం, పూర్ణాహుతి, తదితర పూజలు, అన్న సంతర్పణ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ రాజన్న, కె.నారాయణరావు, కావలి సంతోష్, సిరిపురం నాగరాజు, భీమన్న, కడుకుంట్ల నర్సింలు, దాసరి బాబన్న, కత్తెరపాక రాజేశ్వర్, దేవోళ్ల రాజు, తైదాల శంకర్, మేసు రాజేశ్వర్, కుచన్‌పెల్లి గంగాధర్, దాసరి నాగరాజు, బత్తుల నారాయణ, సూదం మల్లేశ్, కూచనపెల్లి శివ తదితరులు ఉన్నారు.

కూలిన చెట్లు తొలగింపు



పడిన చెట్టును తొలగిస్తున్న యువకులు

దస్తురాబాద్: మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలకేంద్రంలో గీతాశ్రమంలోని రామాలయంపై కూలిన చెట్లను ఆదివారం గ్రామ యువకులు తొలగించారు. అనంతరం ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు.

రోడ్డుపైనే లారీలు



ప్రధాన రోడ్డుపై వరుసగా నిలిచిన లారీలు

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామంలో ప్రధాన రహదారిపై పదుల సంఖ్యలో లారీలు నిలిచిపోయాయి. గ్రామంలో ఉన్న ప్రభుత్వ గోదాంలకు రైస్‌మిల్లుల నుంచి బియ్యంబస్తాలు లారీల్లో తీసుకురాగా సరిపడా హమాలీలు లేకపోవడంతో అన్‌లోడింగ్ ప్రక్రియ పూర్తి చేయలేదు. దీంతో రోడ్డుపై నిలిచిన లారీలతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు బియ్యంబస్తాలను గోదాంలలో దించి లారీలను పంపించాలని ప్రజలు కోరుతున్నారు.

నీటి సమస్యకు పరిష్కారం

తానూరు(ముధోల్): ముధోల్ మండలం తరోడా గ్రామంలో ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మహిళలు శనివారం ఖాళీ బిందెలతో జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించిన విషయం తెలిసిందే. స్పందించిన అధికారులు ఆదివారం తరోడా గ్రామానికి వెళ్లి కాలనీలో బోరు మోటారుకు మరమ్మతులు చేయించి స్థానికులకు నీటిని అందించారు.

నిర్మల్‌లో పరిశుభ్రత ఏది?



ఎన్టీఆర్ మార్గ్‌లోని ఖాళీప్లాట్లలో పిచ్చిమొక్కలు, వర్షపునీరు



భాగ్యనగర్‌కాలనీలో పెరిగిన పిచ్చిమొక్కలు



ప్రియదర్శినినగర్‌లో చెత్తాచెదారం, నిలిచిన నీరు

- పట్టణంలో అస్తవ్యస్తంగా డ్రెయినేజీలు
- దోమలకు నిలయంగా ఓపెన్ ప్లాట్లు
- రోగాల బారిన పడుతున్న జనం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

నిర్మల్‌టౌన్: నిర్మల్ మున్సిపాలిటీలోని వార్డులు సమస్యలకు నిలయంగా మారాయి. ఖాళీస్థలాల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడం, ఇష్టానుసారంగా చెత్తాచెదారం పడేయడం, ఇళ్ల నడుమ నిలిచిన నీటితో పరిసరాల్లో శుభ్రత కరువైంది. వర్షాలకు ఖాళీస్థలాలు నీటి కుంటలను తలపిస్తున్నాయి. దీనికి తోడు చుట్టుపక్కలవారు చెత్త పడేయడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో స్థానికులు డెంగీ, మలేరియా వంటి విషజ్వరాల బారిన పడుతున్నారు. పలు డ్రెయినేజీలు, కందకాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారంతో పేరుకుపోయాయి. దీంతో పాములు, విషపురుగులు సంచరిస్తున్నాయి. సమస్యలు పరిష్కరించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆయా కాలనీల ప్రజలు వాపోతున్నారు.

పలు కాలనీల్లో..

జిల్లా కేంద్రమైన నిర్మల్‌లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. మెజార్టీ కాలనీల్లో డ్రెయినేజీలే లేవు. పట్టణంలోని ప్రియదర్శినినగర్, సాగర్ కాలనీ, శ్రీనగర్, రవినగర్, ఆదర్శనగర్, ఎన్టీఆర్ మార్గ్, దివ్యనగర్, ఇంద్రనగర్, శాస్త్రినగర్, బాగులవాడ, రాంనగర్, మంజులాపూర్‌లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ప్రధాన వీధుల్లో డ్రెయినేజీ కాల్వలు ఇళ్ల ముందు నుంచే పారుతున్నాయి. కొన్నిచోట్ల చిరు వ్యాపారులు డ్రెయినేజీలను ఆక్రమించుకొని వ్యాపారం చేస్తున్నారు.

పట్టణంలో 266 మంది పారిశుద్ధ్య కార్మికులు..

పట్టణంలో మొత్తం 266 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉండగా.. వారిలో 14 మందే రెగ్యులర్ సిబ్బంది ఉన్నారు. మిగతా వారంతా కాంట్రాక్ట్ ఉద్యోగులే. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థను సరిచేయాలని ఆయా కాలనీల ప్రజలు వేడుకుంటున్నారు.

దోమల నివారణకు చర్యలేవి..?

పట్టణంలో విషజ్వరాలు విజంభిస్తున్నా.. దోమల నివారణకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. కాలనీల్లో దోమల నివారణ మందు పిచికారీ, శానిటేషన్ చర్యలు చేపట్టడం లేదు. కేవలం అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్న నివాసాల పరిధి వీధుల్లోనే దోమల నివారణ మందు, శానిటేషన్ చేస్తున్నారని కొందరు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

రోగాల బారిన పడుతున్నాం



ప్రస్తుతం పట్టణ ప్రజలు జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. దోమల నివారణకు, డ్రెయినేజీలు శుభ్రంగా ఉండేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలి. ఖాళీ ప్లాట్‌లో పేరుకుపోయిన పిచ్చిమొక్కలను తొలగించాలి. దోమలు రాకుండా కాలనీలో స్ప్రే చేయించాలి.

– శివాజీ, నిర్మల్

చర్యలు తీసుకుంటాం..



వర్షాకాలం మొదలైనప్పటి నుంచి పట్టణంలో డ్రెయినేజీల్లో పూడిక తీసి శానిటేషన్ చేస్తున్నాం. పిచ్చిమొక్కలను సైతం తొలగిస్తాం. ప్రజలు రోగాల బారిన పడకుండా దోమల నివారణ మందు పిచికారీ చేయించి బ్లీచింగ్ చల్లిస్తున్నాం. వారంలో రెండు రోజులు ట్యూస్‌డే డ్రై డే , ఫ్రైడే డ్రై డే కార్యక్రమాలు చేపడుతున్నాం. వైద్యారోగ్య శాఖతో కలిసి కాలనీల్లోని ప్రజలకు నీరు నిల్వ ఉంచకూడదని అవగాహన కల్పిస్తున్నాం. ఖాళీస్థలాల్లో ఆయిల్ బాల్స్ వేయిస్తున్నాం. ఖాళీస్థలాలతో ఇబ్బంది అవుతుందని మాకు సమాచారమిస్తే యజమానులకు నోటీసులు పంపిస్తాం.

– జగదీశ్వర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్

'గుండెగాం సమస్య పరిష్కరించండి'



నారాయణ్‌రావుకు సమస్య వివరిస్తున్న గ్రామస్తులు

భైంసాటౌన్: ఏటా వర్షాకాలంలో తమ గ్రామం ముంపునకు గురవుతోందని.. పునరావాస చర్యలు వేగవంతం చేసి సమస్య పరిష్కరించాలని మండలంలోని గుండెగాంవాసులు పలువురు కోరారు. ఆదివారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్‌ను కలిసి విన్నవించారు. గ్రామంలోని పల్సికర్ రంగారావు ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌తో గ్రామంలోకి వర్షపు నీరు చేరి ముంపునకు గురవుతున్నామని.. ఇళ్లు, పంటలు నష్టపోయి ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. పునరావాస చర్యల్లో భాగంగా గ్రామస్తులకు నష్ట పరిహారం, కేటాయించిన స్థలాల్లో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



బాసరలో గోదావరి వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు



పంచగుడి వంతెన వద్ద వాహనదారులను వివరాలు అడుగుతున్న ఎస్సై అశోక్

బాసర: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఏఎస్సై శ్యామూల్ పేర్కొన్నారు. ఎస్పీ ఆదేశాలతో ఆదివారం బాసరలో నిజామాబాద్–భైంసా ప్రధాన రహదారిపై పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్సు, బీమా తదితర పత్రాలను పరిశీలించారు. పలువురు పోలీసులు ఉన్నారు.

లోకేశ్వరం: వాహనాలు నడిపేటప్పుడు తమ వెంట అన్ని వాహన పత్రాలను ఉంచుకోవాలని ఎస్సై అశోక్ అన్నారు. ఆదివారం మండలంలోని పంచగుడి వంతెన వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. 15 వాహనాలు తనిఖీ చేసి ధ్రువపత్రాల్లేని వాహనాలకు జరిమానా విధించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఎస్సై దిగంబర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వాగు ఇలా.. నీరు పారేదెలా..!



బైపాస్ వంతెనకు ఓవైపు ఒడ్డున రాళ్లు



పిచ్చిమొక్కలతో సుద్దవాగు స్థలం

- ఆక్రమణలతో తగ్గిపోతున్న సుద్దవాగు విస్తీర్ణం

భైంసాటౌన్: పట్టణంలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టు దిగువన ఉన్న సుద్దవాగు నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగడం లేదు. ఏటా వర్షాకాలంలో ఎగువన గడ్డెన్నవాగు ప్రాజెక్టు గేట్లు ఎత్తినప్పుడు వరద పారేందుకు సరైన దారి లేకపోవడంతో నివాస, వ్యాపార సముదాయాల్లోకి నీరు వస్తోంది. ముఖ్యంగా ఆటోనగర్ బైపాస్ వంతెన వద్ద ఆక్రమణలతో సుద్దవాగు పరీవాహక ప్రాంతం తగ్గిపోతోంది. వంతెనకు ఇరువైపులా కొందరు రాళ్లు, మట్టి వేసి వాగు పరిధి ప్రాంతంలోకి చొచ్చుకొస్తున్నారు. ఫలితంగా నీరు పారకంలో అడ్డంకి ఏర్పడి నివాస ప్రాంతాల్లోకి వరద వస్తోంది. గతంలో పలుమార్లు ఇలాంటి ఘటనలు తలెత్తినా అధికారులు నిద్రమత్తు వీడటం లేదు. ఇప్పటికైనా వాగు పరీవాహక పరిధి హద్దులు గుర్తించి.. ఆక్రమణలుంటే తొలగించాలని పట్టణవాసులు కోరుతున్నారు. తద్వారా వరద ముసక నుంచి తమను కాపాడాలని వేడుకుంటున్నారు.

వైభవంగా సుదర్శన యాగం



యాగంలో పాల్గొన్న భక్తులు

నిర్మల్‌టౌన్: శ్రావణమాసం పురస్కరించుకొని జిల్లాకేంద్రంలోని బాలాజీవాడలో గాల అలివేలు మంగ అమ్మవారి ఆలయంలో ఆదివారం శ్రీచక్ర సహిత మహా సుదర్శన యాగం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు టి.కే రామకన్నన్, ఆలయ అర్చకులు పాంచరాత్ర ఆగమం ప్రకారం విశ్వక్సేన ఆరాధన పుణ్యాహవచనం జరిపించారు. పంచసూక్త శ్రీ చక్ర సహిత మహాసుదర్శన యాగం క్రతువును సంప్రదాయంగా నిర్వహించారు. సుదర్శన యాగ ఫలితాలను భక్తులకు వివరించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త ఆమెడ శ్రీధర్, పద్మావతి, హరిక, రాజులదేవి రాజశేఖర్, పతిక రమేశ్, గంధం సుధాకర్ భక్తులు పాల్గొన్నారు.

గొడుగుల సందడి



కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తుండటంతో గొడుగులు, రేన్‌కోట్లు కొనేవారి సంఖ్య పెరుగుతోంది. జిల్లాకేంద్రంలోని ప్రధాన రోడ్ల పక్కన విక్రయించే రంగురంగుల గొడుగులు, రేన్‌కోట్లు చిన్నారుల నుంచి పెద్దల వరకు ఆకట్టుకుంటున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



'పేదలపై అక్రమ కేసులు తొలగించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఖానాపూర్: ఖానాపూర్‌లో అనర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించారని అధికారుల తీరును నిరసిస్తూ ఆందోళనలు చేసిన నిరుపేదలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేశ్, ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి పీటర్, బహుజన కమ్యూనిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకులు పసుపుల వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని విద్యానగర్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు రాని నిరుపేదలతో నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడారు. బాధిత పేదలకు వామపక్ష పార్టీల తరఫున అండగా ఉండి పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వం సర్వేల పేరిట కాలయాపన చేయకుండా అనర్హులను తొలగించి అర్హులకు ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో ఇళ్ల కేటాయింపులో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి.. అర్హులకు న్యాయం జరగకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం లింగన్న, బాధితులు రాధ, కవిత, పద్మ, గౌస్, స్వప్న, లలిత, సునీత, సురేశ్, అన్వర్, మజీద్, సాదుల్లా, తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన



ఆవుకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ఖానాపూర్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం పట్టణంలో ఆవుకు వినతిపత్రం ఇచ్చి వినూత్న నిరసన తెలిపారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు, వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కార్మికులకు నెలకు రూ.10వేల వేతనం.. ప్రతీ నెల ఐదో తేదీ లోపు అదించాలని వేడుకుంటున్నారు. కార్యక్రమంలో పలువురు మధ్యాహ్న భోజన కార్మికులు లక్ష్మి, మంజుల, విజయ, రాజేశ్వరి, లింగవ్వ, మంగ, పద్మ తదితరులు ఉన్నారు.

రైతులను మోసం చేయొద్దు



దస్తురాబాద్‌లో తనిఖీ చేస్తున్న ఎస్సై సాయికిరణ్

దస్తురాబాద్: నకిలీ ఎరువులు, విత్తనాలను విక్రయించి రైతులను మోసం చేయొద్దని ఇన్‌చార్జి ఎస్సై సాయికిరణ్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మున్యాల, దస్తురాబాద్, రేవోజీపేట, పేర్కపల్లె గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా దుకాణాల్లోని లైసెన్స్, స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఎరువులు, విత్తనాల వివరాలు తెలిసేలా బోర్డు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. తనిఖీల్లో ఏఎస్సై భీంరావు,' పోలీసు సిబ్బంది సురేందర్, రాజన్న తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: మండలంలోని సత్తన్‌పల్లి, గోసంపల్లె గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆదివారం రాహుల్ గైక్వాడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా సరుకుల నిల్వలతోపాటు రికార్డులు పరిశీలించారు. గడువుతేదీ దాటిన ఎరువులు, విత్తనాలను విక్రయించవద్దని పేర్కొన్నారు. ప్రతి రైతుకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. రిజిష్టర్లలో స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని డీలర్లకు సూచించారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి



వసంత్‌రావు, ఏవో, లక్ష్మణచాంద

లక్ష్మణచాంద: ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సాగు చేస్తున్న పంటలు నష్టపోకుండా రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారి వసంత్‌రావు సూచిస్తున్నారు. రానున్న రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని.. పంటలపై క్రిమిసంహారక మందుల పిచికారీని తాత్కాలికంగా వాయిదా వేయాలని పేర్కొంటున్నారు.

వరి:

- భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో వరి పొలం, నారుమడుల నుంచి నిల్వనీటిని వీలైనంత వరకూ తీసివేయాలి.
- రైతులు పచ్చిరొట్ట వేసుకున్న రైతులు భూమిలోనే కలియదున్ని దమ్ము చేసుకోవడం ప్రారంభించుకోవాలి. దమ్ము చేసుకున్న సమయంలో 50 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్ చల్లితే తొందరగా కుళ్లిపోయే అవకాశం ఉంటుంది.
- ఇప్పటివరకు వరినారు పోసుకోని రైతులు ఈ వర్షాలను సద్వినియోగం చేసుకొని పొలాలను దమ్ము చేసి నేరుగా వెదజల్లే పద్ధతిలో గాని లేదా డ్రమ్ సీడర్ ద్వారా వరి పంట సాగు చేసుకోవాలి. దీంతో 10 నుంచి 15 రోజుల ముందుగానే పంట కోతకు వస్తుంది. ఈ విధానంలో ఎకరాకు 12 కిలోల విత్తనం సరిపోతుంది.
- నేరుగా విత్తే పద్ధతిలో రైతులు వరిధాన్యం స్వల్పకాలిక సన్నరకాలను (120–125 రోజులు) ఎంచుకోవాలి.

పత్తి..

- అధిక వర్షాలతో పత్తి పంటను వడ తెగులు తేలికగా ఆశించే అవకాశం ఉంటుంది.
- వర్షాలు తగ్గిన తర్వాత వడ తెగులు సోకిన మొక్కల మొదళ్ల దగ్గర 3 గ్రా.కాపర్–ఆక్సీ–క్లోరైడ్ మందును లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పోయాలి. అలాగే పంట త్వరగా కోలుకోవడానికి నీటిలో కరిగే ఎరువులైన మల్టీకె కిలో ఎకరాకు లేదా 500 ఎంఎల్ నానోయూరియా ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి



నివాళులర్పిస్తున్న సొసైటీ సభ్యులు

నిర్మల్‌టౌన్: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పలువురు పేర్కొన్నారు. ఆదివారం డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఎడ్యుకేషనల్–వెల్ఫేర్ సొసైటీ నిర్మల్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం వర్ధంతి నిర్వహించారు. నిర్మల్‌రూరల్ మండలం కొండాపూర్ బాలసాధనంలో అనాథ పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మహమ్మద్ అజాహరుద్దీన్, సుమలత, మహమ్మద్ అన్వర్, మహమ్మద్ అబ్దుల్ మసూద్, అబ్దుల్ అజీమ్ తదితరులు ఉన్నారు.

నేడు రేషన్‌కార్డుల పంపిణీ

సారంగపూర్: సారంగపూర్ సమీపంలోని కరుణాకర్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో మండలంలోని ఆయా గ్రామాల ప్రజలకు మంజూరైన నూతన రేషన్‌కార్డులను సోమవారం ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి పంపిణీ చేస్తారని తహసీల్దార్ శ్రీదేవి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈకార్యక్రమానికి లబ్ధిదారులు హాజరై రేషన్ కార్డులు అందుకోవాలని సూచించారు.

నేటి నుంచి ఉత్సవాలు

కుంటాల: మండలంలోని అంబకంటి గ్రామంలో శివపరివార స్థిర ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఈనెల 28వ తేదీ (సోమవారం) నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు తరలివచ్చి మహోత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.